# పులిగుండు

గుండెక్కాడు బాలిగాడు!

పులిగుండెక్కాడు బాలిగాడు. పులిగుండు మీద నిలబడి ఉధృతంగా వీస్తున్న గాలికి పొరకపుల్లలా ఊగిపోతున్నాడు.

అబ్బ పులిగుండు!-

తలపైకెత్తి చూస్తే తలగుడ్డ కింద పడిపోయే గుండు. కలిగిన వాడి కండకావరానికి ప్రతీకగా . . . లేని వాడి పేరాసకు పతాకగా నిలబడ్డ గుండు. గజదొంగ అంబోదర గిడ్డడికి తన గుండెల్లో ఆశ్రయమిచ్చిన గుండు!!-

చిత్తూరు జిల్లాలో రాయల చెరువంత చెరువు... పేరూరు బండంత బండ- లేవన్న నానుడికి ముడిపడి పులిగుండంత గుండు కూడా లేదనిపించుకొన్న గుండు! ఉగ్రాణంపల్లెకు ఉత్తరంగా ... ఊరి పొలిమేరల్లో నింగిని అందుకోవడానికి నిక్కుతూ ఉంది!-

ఆ గుండెక్కాడు బాలిగాడు!

ఆ గుండెక్కి అసాధ్యాన్ని సుసాధ్యం చేశానన్న ధీమాతో గుండుమీద నిలబడి శరవేగంతో వీస్తున్న గాలికి వెనక్కూ ముందుకూ ఊగిపోతూ 'నిజం చెప్పేస్తా! ... నిజం చెప్పేస్తా!' అని గొంతు చించుకొంటున్నాడు బాలిగాడు!.......

అప్పటికి సరిగ్గా పదిరోజుల క్రిందట. ఆ పాయకట్లోని ఒక పల్లెలో ఎవడికో ఒకడికి అటు రెండుసార్లు, ఇటు రెండుసార్లు వాంతీబేదు' లయ్యాయట! ఆ వార్త గాలి వేగంతో పాయకట్టంతా ప్రాకింది. శిరిపిరెడ్డిచిన్నమరెడ్డి చెవిలోకూడా పడింది. అప్పుడు ఆయన మనస్సులో ముత్యాలమ్మ మెదిలింది.

ఆ పాయకట్లో పది పదిహేను గ్రామాలు ఉన్నాయి. గ్రామ గ్రామానికి ఒక గెవిని ఉంది. గెవిని గెవిన్లో ఒక గ్రామ దేవత ఉంది. అయితే ఈ గ్రామ దేవతల కంతా అధిష్టాన

దేవతగా ముత్యాలమ్మ పులిగుండు కింద వెలిసింది.

ఈ ముత్యాలమ్మ దేవాలయానికి ధర్మకర్త శిరిపిరెడ్డి చిన్నమ రెడ్డి!

ధర్మకర్త చిన్నమరెడ్డి మనసులో ముత్యాలమ్మ మెదలడమే తరువాయి - గ్రామ కరణం కోసరం మనిషిని పంపాడు. ఆయన కోసరం ఎదురుచూస్తున్నాడు.

చిన్నమ రెడ్డి పేరుకు చిన్నమ రెడ్డే కానీ - ఆయన చిన్న మనిషి కాదు. ఆయనది చిన్న మనసూ కాదు. అందుకే ఆ పాయకట్లో ఆయన మాటకు తిరుగు లేదు. చేతకు ఎదురులేదు. ఆ పాయకట్టు -''నడు' అంటే ఒక తాటిమీద నడుస్తూ ఉంది. అలాంటప్పుడు గ్రామ కరణం ఏముంది? కాకితో కబురంపితే చాలు!

"నమస్కారం రెడ్డెయ్యా! ఏమో రమ్మన్నారట!" అంటూ గ్రామ కరణం వచ్చి వినయంగా వంగి ముందు నిలబడ్డాడు.

"కూర్చో కరణమయ్యా"

అయినా కరణం గారు కూర్చోలేదు.

"విన్నారు కదా ఈ సంగతి"

"విన్నాను"

"ఏటా ముత్యాలమ్మకు తిరణాల జరిపిస్తానే ఉండాం కదా? మళ్ళా ఆ తల్లికి మన మింద ఎందుకు ఆగ్రహం కలిగిందో?"

"అది ఆగ్రహం కాదు రెడ్డెయ్యా! - మనమింద అనుగ్రహం. సరిగ్గా రాబోయ్యే పదో నాటికి ఆమె తిరణాల జరిపించాల. ఆ సంగతి మనకు గుర్తు చేసిందా మహాతల్లి!"

చిన్నమ రెడ్డి తల పంకించాడు. ఒక లే నవ్వు ఆయన పెదవుల్ని వంపులు తిప్పింది. అరమోడ్పు కన్నులతో పులిగుండు వైపు తిరిగాడు. రెండు చేతులెత్తి నమస్కరించాడు. తర తరాలుగా వస్తున్న సంప్రదాయానికి కట్టుబడినట్లుగా కరణం కూడా రెడ్డిగారిని అనుసరించాడు.

"అయితే తిరణాలకు దుడ్లు?..."

"నిరుడు పెట్టిన ఖర్చుకంటే ఈ ఏడాది రెండింతలుగా పెట్టచ్చు"

"అవునా?" ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు రెడ్డి.

"అవునయ్యా! తమకు గుర్తు లేదేమో కానీ.... ఈ యేడాది తమ చేతుల మిందగా ఎన్ని మద్దిస్తాలు జరిగింది? ఎన్ని తగాదాలు తెగింది? తాము తప్పని తేలిస్తే వేసిన 'తప్పు' అప్పటికప్పుడే కట్టావుండారు గదా? అది ముత్యాలమ్మ సొత్తు. జాగర్తగా కాపాణ్ణాను. అయినా కాలం మారిపాయ. ఈ కాలాన మనుషులు తప్పు చెయ్యాలంటే వెనకా ముందాడే పనేలేదు. కోడి మెడకాయ తిప్పినంత సులువుగా చేసేస్తా వుండారు. వేసిన 'తప్పు'ను కూడా అంత లేసుగా కట్టేస్తాఉండారు."

"మన చేతుల్లో ఏముండాదిలే కరణమయ్యా? అంతా ఆ తల్లిదయ. తనకు ఎట్లా కావాల్నో అట్లానే జరిపించుకుంటా ఉండాది. అయితే ఇంక ఆలస్యమెందుకు ?...జరిగే పన్లు జరగనీయండి మరి?"

రెడ్డిగారి నోట్లో మాట నోట్లో ఉండగానే తుడుం మీద దెబ్బ పడింది.

ఆ దెబ్బతో పాయకట్టు మేలుకొనింది. మేలుకోవడమంటే నిక్కతా నీలగతా బద్ధకంగా ఒళ్ళు విరచుకొంటూ ఆవులిస్తూ పైకి లేవడం కాదు. లేడికి లేచిందే పరుగన్నట్లు ఊపు అందుకొనింది!

ఏడాదిగా ముత్యాలమ్మ గుడిలో బూజు పట్టిన శిలల్ని బైట పెట్టారు. దుమ్ము దులిపారు. కొత్త రంగులు వేయించారు. ఆ శిలల్ను ఎత్తుకొని కొందరు మెరవణికి బయలుదేరారు. పంబలు పలకలు స్వాగతాలు పలుకుతూఉంటే పల్లెపల్లెలో ఆశిలలు ప్రతిఇంటిముందు నిలబడుతున్నాయి. హారతులు అందుకొంటున్నాయి. పంపకాలు స్వీకరిస్తున్నాయి. అలా ఒక పల్లె నుండి మరొక పల్లెకు శిలలు పాయకట్టుమీద మెరవణి తిరుగుతున్నాయి!

ఇక్కడ ముత్యాలమ్మ గుడిచుట్టూ అడ్డంఆపు లేకుండా పెరిగిపోయిన చిట్టి పొట్టి పొదలను...ముండ్ల కంపలను తెగనరికి శుభ్రం చేసే వాళ్లు కొందరు...గుడికి వెల్లవేసే వాళ్లు కొందరు...గుడి చుట్టూ అందంగా పందిరి వేసేవాళ్లు కొందరు....వ్యాపారస్థులు అంగళ్లు పెట్టుకోవడానికి గుడిసెలు వేసేవాళ్లు కొందరు-అదేదో మొక్కుబడిగా కాకుండా ప్రతివ్యక్తి తన ఇంట్లోనే ఏదో శుభకార్యం జరుగుతున్నంత శ్రద్ధగా పనిచేశారు.

ముత్యాలమ్మ గుడి చూడముచ్చటగా తయారయింది!

ఆ సమయానికి శిలలు పాయకట్లో మెరవణి పూర్తి చేసుకొని దేవాలయాన్ని చేరాయి.

శిలలు ముత్యాలమ్మ గుడిని చేరగానే పల్లె పల్లె నుండి పొంగళ్లు బయలుదేరాయి!

ఇంటికొక్క పొంగలి. విధిగా పొంగలి కొక్క కోడిపిల్ల...పొట్టేలు....లేకపోతే మేకపోతు ఉండి తీరాలి. అలా బలి ఇవ్వకపోతే ముత్యాలమ్మ కోపగించు కొంటుందన్న భయం. ఆ భయంతోనే పేదా సాద ఉన్నా లేకున్నా అప్పో సప్పో చేసి ముత్యాలమ్మకు పొంగళ్లు పెడతారు.

కలిగిన వాళ్లు కంచిపట్టు చీరలతో, కంచు పాత్రలతో బయలుదేరారు. లేనోళ్లు మడివేలు ఇచ్చిన ఎరవలి చీరలతో మట్టి పాత్రలతో తృప్తిపడ్డారు. ఒక పల్లె నుండి పొంగళ్లు బయలుదేరాయి. ఆ పొంగళ్లతో మరొక పల్లె పొంగళ్లు జత చేరాయి.

ఆ పొంగళ్లను అనుసరిస్తూ పొట్టేళ్లు....మేకపోతులు....కోళ్లు! మరొక గంటలో వాటి గతిని ఊహించుకోలేకుండా మేతకనుకుంటే మగవాళ్లు వాటిని నడిపించుకుంటూ!

ఆ కోలాహలంలో లేచిన దుమ్ము కావిరంగులో ఎండతో పోటీ పడ్తూ పూచిన మోదుగ వనం కదిలినట్టుంటే పొంగళ్లు ముత్యాలమ్మ గుడిని చేరుకొన్నాయి.

దాదాపు వెయ్యి కుటుంబాలు. కుటుంబానికొక్క పొంగలి. పొంగలి కొక్కపొయ్యి. ఆ పొయ్యి పెట్టుకోవడానికి ఆడవాళ్లు మూడు రాళ్ల కోసరం పోటీ పడుతున్నారు. కొందరు పాత పొవ్వులకోసరం పేచీ పడుతున్నారు. పిల్లలు చెంబులు దుత్తలు తీసుకొని ప్రక్కన గుంటలో నీళ్లు తేవడానికి పరుగులు తీస్తున్నారు. పొయ్యిలోకి నాలుగు ఎండుపుల్లలు ఏరుకొని రావటానికి మగవాళ్లుబోడిగుట్టలమీద పడ్డారు. వ్యాపారస్తులు, జూదగాళ్లు, పగటి వేషగాళ్లు అదే అదనుకొని అంతో ఇంతో సంపాదించుకోవటానికి తాపత్రయ పడుతున్నారు. కనికరం వొలకబోస్తూ కసాయి పనులకు వొడిగట్టే మనుషులు! ఇక కాసేపట్లో గొంతుకోసే కోడికి నీళ్లుతాగిపిస్తున్నాడొకడు.తలా మొండెమూ రెండూ రెండు తునకలుగా తెగనరకబోతున్న పొట్టేలికి పిడికెడు కసువు నోటికందిస్తున్నా డొకడు. మడివేలి మునిగాడు మాత్రం ఎండిన ముష్టికొమ్మమీద సన్నని ఇసుకపోసి కత్తిని నూరిందే నూరిందిగా ఉన్నాడు. చెట్లకు రాళ్లకు కట్టేసి ఉన్న పొట్టేళ్లను, మేకపోతులను ఒక కంట గమనిస్తూ మరొక కంటితో కత్తి వాదరను తడిమి తడిమి చూస్తున్నాడు!

వెయ్యి పొవ్వులు వెలిగాయి. వెలుగుల్లో మంట. మంటల్లో కలిసి పొగ. నీలాలు పారే పొగ నిమ్మళంగా పైకి లేచి ఆ ప్రాంతమంతా వ్యాపించింది. నింగి నేల కొంగినట్లుంది.

తనకు జరిగిన అన్యాయాన్ని ఆ పాయకట్టుకు ఏక కాలంలో ఎలుగెత్తి చాటే అవకాశం కోసరం ఎదురు చూశాడు బాలిగాడు. ఆ అవకాశం ముత్యాలమ్మ తిరణాల రూపంలో వెదుక్కొంటూ వచ్చింది. అందుకే ఆరోజే పులిగుండెక్కాడు బాలిగాడు!...

గుండు మీద నిలబడి బాగా వంగి రెండుగా చీలిన గుండు సందులో తలపెట్టి "నిజం చెప్పేస్తా!నిజం చెప్పేస్తా!!"" అని అరుస్తున్నాడు బాలిగాడు. అంత ఎత్తునుండి అరుస్తున్నా...ఆ ఎత్తులో గాలి తిప్పించి మళ్లించి కొడుతున్నా....గుండు సందులో మాటలు చెవుల్లో గంట కొట్టినట్లు వినిపిస్తున్నాయి!

అందరి చూపు అటు మళ్లింది.

"అరెరె! బాలిగాడు గుండెక్కేసినాడే! అదెట్లా సాద్ది పడిందబ్బా?"

"పిచ్చినా కొడుక్కేమి పొయ్యేకాలమో?....ఇంత పనికి వగతెగించినాడే!"

గుండు చుట్టూ చేరిన జనం తలకొక తీరుగా మాట్లాడుతున్నారు.

ఇదంతా ఏమీ గమనించే స్థితిలో లేడు బాలిగాడు. "నిజం చెప్పేస్తా!...నిజం చెప్పేస్తా!!"" అని అరుస్తున్నాడు.

"నీమొకం నువ్వేందిరా చెప్పేది నిజం?...ఒరే పిచ్చినా కొడకా! ఇన్నాళ్లూ చెప్పంది ఇప్పుడేందిరా నువ్వు చెప్పే నిజం?...అణ్ణుంచి పణ్ణావంటే పులుసులోకి ఎమిక కూడా దొరకదు. నిజం చెప్పింది చాలుగానీ నువ్వు దిగిరారా నీ యమ్మాబడవా?"

కొందరు అరుస్తున్నారు. కొందరు చేతులతో సైగ చేస్తున్నారు.

"అదో అట్లా చూడండి!" ఉన్నట్టుండి ఉలిక్కి పడ్డట్టు అరిచాడు బాలిగాడు. ఎటు చూడమంటున్నాడో? ఏమి చూడమంటున్నాడో? అర్థం కాకపోయినా అందరూ వెనక్కు తిరిగి

చూశారు.

"అహోహ్! ఎంత పత్తిత్తురా?...పచ్చి పసుపు కొమ్ము మాదిరుండాది. పచ్చి పసుపు కొమ్మేసాది పూసుకొనింది. పావలా కాసంత కుంకం బొట్టు పెట్టుకొనింది. పట్టుచీర గట్టింది. తలనిండికి పూలు తురుముకొనింది. నంగనాచి టంగుబుర్ర మాదిర్తో పొంగలి పెడ్తా ఉండాది చూడండ్రా! ఇప్పుడేమో పదిమందిలో...అప్పుడేమో ఎవుడికీ తెలవకుండా ఒకడికి పొంగలి పెట్టించింది. హ్హా హ్హా హ్హా! ఒరే! పిచ్చినాయాలి గుంపా? ఇంకా ఎవురో తెల్సుకోలేదా? మల్లా నన్ను పిచ్చోడంటా ఉంటిరే! అట్ట చూడండి రా నా సాములాల్లా! నిమ్మకు నీళ్లెత్తినట్టు ఎంత నిమ్మళంగా ఉండాదో మణిసి. అంతే గదా మల్లా. పేరేంది? నిర్మలమ్మ గదా? కొంపలు కూల్చినా గొంతులు కోయించినా నిమ్మళంగా ఉండొద్దూ?" బాలిగాడి ధోరణి అంతు పట్టక అందరు చెవులు రిక్కించి వింటున్నారు.

నిర్మలమ్మ! చెక్కిన బొమ్మలాంటి నిర్మలమ్మ! పాతికేళ్ల పడుచు నిర్మలమ్మ! ఉగ్రాణం పల్లెలో బ్రతుకంతా కోర్టు కచ్చేరీలకు పరిమితం చేసి, కాళ్లు పట్టే వాళ్లను...కనుసన్నల్లో మెదిలే వాళ్లను రక్షించుకొంటూ కాదన్న వాళ్లను ఓ కంట గమనిస్తూ అయిదు పదుల వయస్సును అందుకోసమే వెచ్చించిన కృష్ణమనాయుడి జీవితంలో రెండవ భార్యగా అడుగు పెట్టిన అందాల బరిణె నిర్మలమ్మ. పొయ్యి రగిలిస్తూ ఉంది. ఎంతకూ రగలని పొయ్యితో సతమతమవుతూ ఉంది. ఊది ఊది కండ్లుబ్బి చెక్కిళ్లపై కన్నీళ్లు కారుతూ ఉంటే పట్టుకోక చెడిపోతుందేమో? అన్న బెంగతో తుడుచుకోకుండా అవస్థపడుతూ ఉంది.

"ఏడు పెండుకమ్మా నా నాయుడమ్మా!...ఇంకా ఎందుకమ్మా ఆ నంగేడుపులు? ఇంకా ఎంతమందికి పొంగలి పెట్టించాలని ఆ ముక్కు చీదడాలు? ఏమొకం పెట్టుకొని వస్తివి తల్లీ పదిమందిలోకి? చీ చీ! కాపరం వొకడితో కొంగు ఇంకొకడికా? నీదీ ఒక బతుకేనా?... నీ పూజలు ఏ దేవుడందుకుంటాడే?" పూనకం పూనినట్లు బాలిగాడు అరుస్తున్నాడు.

"ఒరే తక్కవజాతి నాకొడకా!... ఇప్పుడెందుకురా ఆ తక్కవ మాట్లు? నోరు మూస్తావా లేదా?" నాయుడి కనుసన్నల్లో బతికే వాళ్ళు కండ్లెర్ర చేస్తున్నారు.

"ఒరే బాలిగా! నీకు బుద్ధుందంట్రా? అప్పుడేమో గెడ్డం పట్టుకొని 'నిజం చెప్పురా' అని బతిమలాడ్తే నిజమే చెప్తానని చేతిలో చెయ్యేసి కూసి తీరా కోర్టులో నాకేమీ తెల్దని మొరిగిన కుక్కా!... ఇప్పుడెందుకురా కారు కూతలు కూస్తావ్?... ఏ దేవుడు మెచ్చుకుంటాడురా నువ్వు చేప్పే నిజం?"... ఒక ప్రక్క ఈ గుట్టు రట్టు కావాలని నాయుడి ప్రతి పక్షం లోలోపల నవ్వుకుంటున్నా పైకి నీతులు నిమిరి నంగి మాటలు పలుకుతూ ఉంది.

"ఒరే! మీవి పెద్ద పెద్ద జాతులేరా!.. ఏ నా కొడుకు కాదనింది? అయితే మీ మాదిరిగా పెద్ద పెద్ద పనులు చేసి బతకలేదురా నేను!... పుట్టి బుద్దెరిగింది మొదులుకొని నాయుణ్ణే నమ్ముకుణ్ణా! బూదేవిని నమ్ముకుణ్ణా! బొట్టు బొట్టుగా చెమటోడ్చినా. నేనే గాదురా. మీరు అనుకుంటా ఉండారే తక్కవ జాతోళ్ళని!. వాళ్లంతా అట్టానే బతకతా ఉండార్రా? కష్టపడేది

మావంతు. తెచ్చి మీ కొంపల్లో పోస్తే మెక్కేది మీవంతు. మీరు ముక్కలదాకా మెక్కి మిగిలింది మా మొకాన ఇదిలిస్తే ఎంగిలి మెతుకులు ఏరుకోని తినేదే మాబతుకు. అయినా మీకు కనికారమే లేదు. కండ్లు అసలే లేవు. ఉండినా అవ్వి కనిపించవు. మా ఏడుపులు యినిపించవు. కండ కావరంతో మీరు నల్లిని నలిపినట్లు నలిపేస్తా ఉండారు మాజాతిని. అవున్రా! నేను తక్కవ జాతోణ్ణే. నిజిమే! జరిగింది జరిగినట్లుగా చెప్తానని చేతిలో చెయ్యేస్తిని. నిజిమే!.. పిచ్చిబట్టి తిరిగినాను. నిజిమే! ఈ పొద్దు ఎట్లెక్కినానో ఏమో? ఆ ముత్తేలమ్మ తల్లికే తెలుసు. పులిగుండెక్కినాను. నిజిమే!- అయితే నేను గాదురా గుండెక్కింది. గుండెక్కింది నిజింరా. నేను గాదురా మాట్లాడ్తా ఉండేది. మాట్లాడ్తా ఉండేది నిజింరా. అందుకే చెప్తావుండా. జాగర్తగా యినండి. నా మాదిర తక్కవ జాతోడు మీ బోటి పెద్ద పెద్ద జాతోళ్ళ మద్దె నిలబడి నిజం చెప్పలేడురా. తెగించి చెప్పినా ఆ మిందట బతకలేడురా!- అందుకే పులిగుండెక్కినా. మీరు కాదుగదా!- మీయబ్బబ్బలు లేచివచ్చినా ఇంక నా ఎంటికలు గూడా పెరకలేరు. అందుకే చెప్తా వుండా. ఇనండిరా యినండి!''

బాలిగాడు ఆవేశం హద్దూ పద్దు లేకుండా సాగుతూ ఉంది.

పొంగళ్లకు నీళ్ల తెచ్చిచ్చి పొయ్యికి నాలుగు ఎండుపుల్లలు ఏరిపెట్టి మిఠాయిలు కొనుక్కోవడానికి రంగుల రాట్నంలో తిరగడానికి దుడ్లుకోసరం తల్లిదండ్రులను వేధించే పిల్లలు కూడా అన్నిటినీ మరిచి అదొక వేడుకగా పులిగుండు చుట్టూ చేరారు. ఇన్నాళ్ళు పిచ్చోడుగా తమని వేధించి ఇప్పుడు పులిగుండెక్కిన బాలిగాడి మీద రాళ్ళు రువ్వడానికి వ్యర్థ ప్రయత్నాలు చేస్తున్నారు. నాయుడు పక్షం నాలుకలు కొరుకుతుంటే ప్రతిపక్షం ముసి ముసిగా నవ్వుకొంటూ వుంది. గుండు సందులో తలదూర్చి బాలిగాడు గుక్క తిప్పుకోకుండా వాగుతున్నాడు.

"పాపం రాముడు! ఎంత మంచోడు వాడు. ఎంత అందగాడు వాడు. అదేం కర్మమో? లేనోళ్ళ కొంపలో పుట్టినాడు. పుడ్తే మాత్రం ఎంత మట్టూ మరేద? ఎంత గుట్టు మట్టుగా బతకతా ఉండె. వాడు గొంతెత్తితే రాళ్లు కరగతా ఉండెనే. మణుసులు మాకుల్లా నిలబడ్తా ఉండ్రే. ఎట్లానో కన్నగసాట్లు పడి పదిదాకా చదువుకుండె. ఈ పాపిష్టి లోకంలో వాడికేదైనా పని దొరికుంటే - ఈ ఊరొదిలి పొయ్యుణ్ణు. ఊరొదిలి పోలేక... కష్టింజేసి బతకలేక ఊళ్ళో ఈ ఇంటికాడ ఆఇంటికాడ పాటలు పాడతా ఏఅమ్మో దయతల్లి అంత ఇదిలిస్తే తిని బతకతా ఉండె. అటుమంటి కన్నోరుమింద కన్నేస్తివి గదే నాయుడమ్మా! అయినా వాడేమన్నా లొబడ్డాడా? లేదే? నీ మాయదారి మాటల్తో వాణ్ణి నమ్మిస్తివి. నీ పాణానికి నా పాణ మంటివి. అయినా ఈడుగాని సావాసం తగదని తన్నుకుండె. అయినా వదిలిపెట్తివా? లేదే? వాడు మాత్రం ఏంజేస్తాడు? - పైన పైన బడ్తావుంటే. పొంగుతుండే వయసు. పత్తిని నిప్పును పక్కన బెట్టి రగలబాక అంటే ఉంటిందా? రగిలిస్తివి. మంట మండిస్తివి. మట్టుబెట్టిస్తివి గదే నాయమ్మా! ... నాయుడమ్మా!

అయినా నువ్వు మాత్రం ఏంజేస్తావులే నాయుడమ్మా? అ ముసిలి పీనిగితో నువ్వేం

సుకం అనబవిస్తివి? అందుకే నువ్వు జేసింది నేను తప్పు అనుకోలా. పోనీలే పాపం! అని పాలుపంచుకుంటి. నావల్ల అయింది నేను జేస్తి. ఎట్టా పసిగట్టినాడో నీ మొగుడు పసిగట్టినాడు. పగబట్టినాడు. చిత్తూరికి ఎలబారి పొయ్‌నట్టుగా పొయ్ అట్టపొయ్ ఇట్టొచ్చి యామారించి చంపెనే రాముణ్ణి. నా కండ్ల ముందర్నే పొడ్సి పొడ్సి చంపెనే! చంపేసి రేత్రికి రేత్రే చిత్తూరు చేరుకుణ్ణె. పాపం రాముడు! పాణాలు వదులుతూ వాడు చూసిన చూపు? అబ్బ! గుండెలు జలదరిస్తా ఉండాయే?"

"ఒరే బాలిగా! ఇందులో నా తప్పేమీ లేదని నీకు బాగా తెల్సురా. తప్పుకోవాలని నేనెంత సతమతమయింది నీకు తెల్సురా. అయినా బలవంతం చేసింది ఆ మణిసే గదరా? వద్దు వద్దని మొత్తుకుంటే గూడా వదిలి పెట్టకుండా నీ పాణానికి నా పాణమిస్తానని నమ్మించింది ఆ మణిసే గదరా? ఇద్దో! దీన్ని లోకానికి చాటాల్సింది నువ్వేరా! చాటు మాటు చేస్తివో నా ఉసురు కొట్టకుండా పోదు" అని చూసినట్టుండెనే ఆ చూపు!

ఆరు నూరుగానీ... నూరు ఆరుగానీ.. నేను మాత్రం నిజం చెప్పేయాలనుకుంటి. ఊళ్లో ఎదురుపార్టీవాళ్లు "ఏమిరా బాలిగా!" అంటే మీ మాటే నామాటంటి. వాళ్లేమో నామాట నమ్మిరి. నా మాట మింద నేను నిలబడ్తానని కోరట్టుకెక్కిరి. పోలీసోళ్ళకు తినబెట్టిరి. ఆ దెబ్బతో నాయుడు గెతి అదోగెతి అనుకుంద్రి. నేను కూడా అట్లానే అనుకుంటి. నాయాలు నాయుడాట కట్టిందనుకుంటి. కానీ వాడే నన్ను మెడబట్టి బయటికి గెంటె. నా పూరి గుడిసెకు నిప్పు పెట్టించె. నా యింట్లోదాన్ని, నన్ను నా కసుగందుల్ను చెట్టు కింద నిలబడేటట్టు చేసె. ఏమి చెయ్యమంటారు చెప్పండి? ఆడికి ఇడ్సిపెట్నాడా? లేదే! నా వాడ వాడనే ఇరకాటంలో ఇరికించె. పెరుక్కోలేక మేము చస్తావుంటే సకిలించె. చెయ్యిజాపి అంతో ఇంతో అప్పు తీసుకున్నోళ్ళను నిలువుగాళ్ళ మింద నిలబెట్టి అప్పు కట్టేసి కదలమనె. కట్టలేక పోతే చెట్లకు కట్టించి కొట్టె. మావాడ మడికయ్యలకు వాడి కయ్యల మింద రావాల్సిన నీళ్లను అటకాయించె. చేతికందిన పంట నోటి కందక మల మల మాడి పోతుంటే వాడ వాడంతా ఏగ్గిటై ఒకనాడు నాదగ్గిరి కొచ్చిరి.

"ఒరే బాలిగా! ఇదేమన్నా బాగుందంట్రా? నిన్ను జూసుకోని గదరా అపోజిట్టు పార్టీ వోళ్లు కోరట్టు కెక్కింది. అది జూసి గదరా నాయుడు మా మింది కెక్కి తొక్కతా వుండేది. ఎట్లా చావమంటావురా మమ్మల ఈ చావు? పోనీ! చచ్చినోడెట్లా చచ్చె. నువ్వు నిజం చెప్తే వాడు బతకబొయ్యేదీ లేదు. నాయుడు మమ్మల బతకనిచ్చేదీ లేదు. ఎందుకురా మమ్మల ఇట్టా ఉట్టికీ సొర్గానికీ రొంటికీ లేకుండా చంపతావు. పుట్టే అప్పు పుట్టకుండా పాయ. పంటలేమో నిలవనా ఎండిపోతా ఉండాయి. ఈ పొద్దో రేపో వాడకు నీ పూరి గుడిసెకు పట్నె గెతే పట్టేటట్టుగా ఉండాది. మమ్మల్నట్టా ఎత్తి గెడ్డన పారెయ్యరా సామీ! నీకు పున్నెముంటింది." అని మొత్తుకుంద్రి. కన్నీరు మున్నీరుగా ఇలపించిరి. ఏం చెయ్యమంటారు చెప్పండి?

ఆ మర్నాడు అద్దరేత్రికాడ నాయుడే నేరుగా మాఇంటికాడికొచ్చె. చెట్టు కింద కడుపులో

కాళ్ళుబెట్టుకోని పడుండిన నా పెండ్లాం పిలకాయిల్ని చూసి కంట తడిపెట్టె! నా రొండు చేతులు వొడిసి పట్టుకోని -

"బాలిగా! ఎందుకొచ్చిన కర్మరా ఇది.. జరిగిందేదో జరిగిపొయ్యింది. బుద్దెరిగిన నాటినుండి పెట్టింది తిని.. ఇచ్చింది కట్టుకొని.. చెప్పిన పని చేసి నాపంచన్నే బతికితివి. ఈ చేతుల్తోనే పెట్టి మల్లా ఈ చేతుల్తోనే కొట్టాలంటే బాదగా ఉండాదిరా. ఉంటిందా లేదా నువ్వే చెప్పు. నా మాటినరా. నీ కొక ఎకరా కయ్య రాసిస్తా. కాలిపోతే పొయ్యింది పూరి గుడిసె. మూడంకణాల ఇల్లెయిపిస్తా. ఒక్క మాట చెప్పరా. ఒకే ఒక్క మాట. 'నాకేమీ తెల్దని!' ఒక్కటంటే ఒక్క మాట చెప్పరా!" అంటా బతిమలాడె.

ఆ పరిస్థితిలో నన్ను ఏంచెయ్యమంటారో మీరే చెప్పండి? నాయుడు బిగించిన ఉచ్చులో తగులుకోని గిలగిలలాడిపోతి. అంతే గదా మల్లా?... కూటికి లేకుండా కుమిలిపోతున్న పెండ్లాం పిలకాయలొక పక్క... నాయుడి చేతుల్లో తగులుకోని నలిగిపోతున్న నా వాళ్ల వొకపక్క.- సమాళించుకోలేక పోతి. అన్నిటికీ దేముడే ఉండాడని సమాదానపడ్తి. కోర్టల్లో 'దేముడి మీద ప్రెమాణం చేసి అంతా నిజమే చెప్తాను. అబద్దం చెప్పను.' అని ప్రెమాణం చేస్తి. కడాన నాకేమీ తెల్దని చెప్పేస్తే కేసు కొట్టేసిరి. నాయుడు బయటపడె. అపోజిట్టు పార్టీ వోళ్ళు నామింద ఎగిరెగిరి పడ్రి. ఏం చెయ్యమంటారు మీరే చెప్పండి."

గత స్మృతితో గిలగిల లాడి పోతున్నాడు బాలిగాడు!

పాయకట్లో జనం పులిగుండు క్రింద నిలబడి దిగ్భ్రమతో వినే వాళ్లు వింటున్నారు. విన్నవాళ్ళు మరికొంతమందితో చెప్తున్నారు. 'ఔరా కలికాలమా?' అంటూ కొందరు నిట్టూరుస్తున్నారు. 'ఏ పుట్లో ఏ పాముందో?... అంతా ఆ ముత్తేలమ్మ తల్లే చూసుకోవాల!' అంటూ ముత్యాలమ్మకు చేతులెత్తి దండం పెడుతున్నారు.

ఆడవాళ్లు పొంగళ్లు దించారు. మడివేలు మునిగాడు నోటికి గుడ్డ అడ్డంగా కట్టుకొని భయభక్తిగా తళిగలు వేయిస్తున్నాడు.చలిబిండి పిసికి ప్రమిదలుగా చేసి నూనె పోసి వత్తులు వేసి తళిగకొక దివ్వె వెలిగించాడు. వేపచెట్టు నీడలో.. ముత్యాలమ్మ గుడిలో.. వెయ్యి తళిగెలు... వెయ్యి దీపాలు ... దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. వెయ్యి కుటుంబాలు పనిగట్టుకొని అలంకరించడంతో చూడ ముచ్చటగా ఉంది ముత్యాలమ్మ! బీదా బిక్కీ పేదా సాదా తీర్థాకులు చేత పట్టుకొని అమ్మవారి ప్రసాదం కోసం ఎదురు చూస్తున్నారు!

ఎగ్గొట్టుకొన్తున్న ఏడుపును దిగమింగుకొన్నాడు బాలిగాడు. అందరి చెవుల్లో పడాలన్నట్లుగా గొంతు చించుకొన్నాడు బాలిగాడు!

"నాయుడు ఎకరా పొలం యిస్తాడని... మూడంకణాల యిల్లెయిపిస్తాడని చీకూ చింతా లేకుండా నలగర్లో పచ్చంగా బతకచ్చనీ - కులకతా ఉంటే దినాలు గడిసె. వారాలు గడిసె. నెలలు తిరిగె. నాయుడు అరీ గురీ మనకుండా ఉండె. అప్పుడు ఏంజెయ్యాల? - అడక్కుండా బోతేఅమ్మన్నా పెట్టదని ఎదటబడి అడిగితే ఏమన్నాడో తెలుసా? "ఒరే! తక్కవజాతి నాకొడకా!

ఎకరా పొలం కావాల్నా? ఎపుడమ్మా మొగుడి సొత్తురా? ఇల్లు కావాల్నా? అవును పాపం! కావద్దూ మల్లా?'' అంటా ఎగిరి తంతాడా! వాడు తన్నింది నన్నా? కాదు నా జాతిని. వీళ్ల మోచేతల కింద నీళ్లు తాగతా ఉండే తక్కువ జాతిని!

తంతే ఏమయింది? నేను పొయ్ ఈదిలో పడ్తి. ఎదురుపార్టీ వోళ్ల కండ్లల్లో పడ్తి. 'చెప్పింది ముందుగానే నాయుడి తావన ఎందుకు లాక్కోలేక పోతివిరా ముదనష్టపోడా!' అంటా ఇంట్లోది మూతిమింద పొడ్సె. ఎదురుపార్టీవోళ్లు ఎకసక్కాలాడ్రి. కారి మొకాన ఊసిరి. ''ఒరే బాలిగా! నేను అడిగిందేంది? నువ్వు చేసిందేంది? ఇది సరిపోతుందంట్రా నీకు?'' అని అంటా రాముడు దెయ్యమై పట్టుకుండె. పిచ్చి నన్ను పట్టుకుండె. నా పెండ్లాం పిలకాయిలు గూడులేని గువ్వలైరి. ఈ వెయ్యి పొవ్వుల్లో మండతావుండే మంట నా కడుపు మంట! అద్దో అట్లా చూడండి!'' అంటూ అరిచాడు బాలిగాడు.

మంత్రముగ్ధులై వింటున్న మంది వాడి మాటతో కూడా తిరిగి చూశారు.

బాలిగాడు అందుకున్నాడు.

''ఒరే నాయుడూ! ముసిలి పీనిగా! పెండ్లాన్ని ఏలుకోలేని యదవా! ఇంకా ఎందుకురా నీకు ఆ మూతి మింద మీసం? మాటదప్పిన నువ్వా? నేనారా? తక్కవ జాతోడు! నేను నిజం చెప్తానంటే నా జాతంతా నీ చెప్పుచేతల్లో పడుండాదని ఇరకాటాల్లో ఇరికించి మీసం వడేస్తివి. లేని ఆశలు పెట్టి నాతో అపద్ధం చెప్పిస్తివి. ఇస్తాననింది అడిగితే ఎగిరి తంతివి. రొండిండ్లకు అగ్గిబెట్టి రొమ్ము గుద్దుకునే యదవా! మాటదప్పిన మోసకారి నాకొడకా! ఎప్పిటికైనా నీ కాలు గుంతలోనేరా! నీ గెతి అముత్తేలమ్మ తల్లి చూడాల్రా!''

''రే!... ఎయ్యరా!!'' అరుస్తున్నాడు నాయుడు.

''హ్హాహ్హాహ్హా!... ఒరే నువ్వుగాదురా. ఇంక నీయబ్బలకు అబ్బలు లేసి వొచ్చినా ఎయ్యలేర్రా! ... హుం! నేనొక పనికి మాల్నె నాకొడుకును. నేనే గాన మాట మింద నిలబడి ఉంటే నిన్ను ఆ చిన్నమ రెడ్డే పైకి లెయ్య కుండా ఏసుణ్ణ దెబ్బ. చిన్నమరెడ్డి హయాంలో చిన్న చీమకు జరగదే అపకారం. అటుమంటిది నాకు జరిగిపాయ. అది నా తప్పు. ఒరే నాయుడూ! ఎపుడూ ఎక్కలేని పులిగుండు ఎక్కేసినా. నిబ్బరంగా నిలబడుకుణ్ణా. నా కడుపుమంట తీరే దాకా తిట్టా. నీయాలు బిడ్డలు నా బిడ్డలు అగోరించినట్టు గోడు గోడున ఏడస్తార్రా!''...

తిట్ల దండకాన్ని అందుకున్నాడు బాలిగాడు.

''రే!... ఇంకా చూస్తావెందుకురా? ... ఎయ్ రా!'' అరుస్తున్నాడు నాయుడు.

ఆమాటతో సరిగ్గానే వేశాడు ఒక్క వేటు మునిగాడు. తలా మొండెం రెండూ రెండు తునకలై రక్తంలో పొర్లాడుతూ ఉంది నాయుడి కండబట్టిన పొట్టేలు!

తీర్తాకులు చేతుల్లో పట్టుకొని... మూడడ్డేళ్ల పాత పేలికలు అడ్డ గోచిగా పెట్టుకొని ముత్యాలమ్మ ప్రసాదం కోసరం పడిగాపులు కాస్తూ ఉండిన బాలిగాడి బిడ్డలు... పట్టుమని పదేండ్లయినా నిండని పసికందులు - 'అయ్యో! నాయినా!' అని అరుస్తూ పరుగెత్తారు తీర్తాకులు నేలకేసి కొట్టి.

"పొద్దు గూట్లో పాయ్ పడ్తాఉండాదప్పుడే! కూర ఉడికే దానికి ఆలీశం అయిపోతింది. తొందరగా ఎత్తండ్రా పొట్టేల్ని" నాయుడు సేద్యగాళ్లను తొందర పెడ్తున్నాడు.

"అయ్యో!... అయ్యయ్యో!..." ఉన్నట్టుండి గుంపులో హాహాకారాలు!

అందరి చూపులు అటు మళ్ళాయి. ఎప్పుడు ఎలా అంటుకొనిందో పట్టు చీర నిప్పంటుకొనింది. పరుగెత్తుతూ ఉంది నిర్మలమ్మ ముత్యాలమ్మ గుడివైపు. అంటుకున్న నిప్పు పరుగుల మింద మంటగా మారింది. భగభగ మండుతున్నాయి మంటలు. లెక్క చెయ్యకుండా నిర్మలమ్మ పరుగెత్తుతూనే ఉంది. మంటలు మరీ ఎక్కువై వొళ్లంతా కాలిమధ్యలోనే పడిపోయింది!

పాపం! ఎంత ప్రయత్నించినా ముత్యాలమ్మను చేరుకోలేక పోయింది!

లబలబ మొత్తుకుంటున్నాడు నాయుడు.

ఓ ఎముకల గూడు... మట్టి పిసికి బతకటానికే నేర్చిన ఎముకల గూడు... అడుసుమడిలాంటి రక్తపు మడుగులో... తునాతునకలైన తనువును ఒకటిగా చేర్చి హృదయానికి హత్తుకోవడానికి అవస్థ పడుతూ ఉంది. ఆ ఆరాటంలో అస్తవ్యస్తంగా తయారైన తనువు మీద పడి కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఉంది.

వెయ్యి కుటుంబాల ఎదురులేని పూజ!... బాలిగాడితో కలిసి వెయ్యిన్నొక్క ప్రాణుల గావు! ఎర్రదనాన్ని ఎగ్గొడుతున్న పడమటి దిశ!... వెయ్యి పొవ్వుల్లో ఎర్రటి మంట!... బాలిగాడి పెండ్లాం కండ్లల్లో చేరి... కన్నీళ్ళుగా మారి... రక్తపు మడుగులో పడ్తూ - ఎర్రగా!

మురిసిపోతూ వుంది ముత్యాలమ్మ!

కలిగిన వాడి కంటి కావరానికి ప్రతీకగా లేనివాడి నిస్సహాయతకు నిదర్శనంగా ధీమాగా నిలబడి ఉంది పులిగుండు! ●

- *ఆంధ్రపత్రిక (26-4-1974)*